
బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

నేడే ఉద్యోగుల
వన సమారాధన

- చెరుకూరి తోటలో ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి
- పెద్ద సంఖ్యలో తరలిరావాలి : ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సకల ఉద్యోగ ఆత్మీయ సమ్మేళనం, వనసమారాధన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో 20వేల మందితో నిర్వహించనున్న వనసమారాధన, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని చెరుకూరి వారి తోటలో నిర్వహించనున్నారు. దీనికోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీజీఈ జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే తోటలో కళావేదిక, ప్రధాన వేదికను సిద్ధం చేశారు. ఉద్యోగుల ఆటపాటలకు అనుకూలంగా క్రీడావేదికలను సిద్ధం చేశారు. సుమారు 20వేల మందికి నాన్‌వెజ్, వెజ్ భోజనాలను సిద్ధం చేస్తున్నారు. ఉదయం శివపార్వతుల కల్యాణం, ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుమారు 20వేల మందికి అతిథ్యాన్ని ఇచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

సమారాధనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లాకు చెందిన ఎంపీలు, శాసనసభ్యులు, టీజీవో, టీఎన్జీవో, జేఏసీ రాష్ట్ర నాయకులు కూడా పాల్గొననున్నారు. జిల్లా కలెక్టర్, సీపీ ఇతర అధికారులు హాజరుకానున్నారు. చెరుకూరి వారి తోటను పోలీస్ అధికారులు శనివారం సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఏసీ రాష్ట్ర సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో నాయకులు తోటలో ఏర్పాట్లను పరిశీలించారు. వన సమారాధనకు ఉద్యోగుల కుటుంబాలకు వచ్చే వీలుగా ఖమ్మం నగరంలోని ఆరు సెంటర్ల నుంచి ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్తీక మాసం రెండో రోజునే జిల్లాలో పెద్దఎత్తున ఉద్యోగుల వనసమారాధన జరుగుతుండడంతో ఖమ్మం పట్టణంలో పెద్దఎత్తున హోర్డింగులు ఏర్పాటు చేశారు. స్వాగత బ్యానర్లు తోరణాలతో ఖమ్మాన్ని సుందరంగా అలంకరించారు.


5న బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 5న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కె.సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మైనారిటీ మత గురువులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎన్జీవో ప్రతినిధులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను ధ్రువీకరణ అఫిడవిట్ రూపంలో ఆరు సెట్లను ఇవ్వాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా బీసీ సంక్షేమ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

సెలవుపై కేఎంసీ కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య శనివారం వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఆయనకు ఈనెల 14 వరకు సెలవులు మంజూరయ్యాయి. కాగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ (కేఎంసీ) పరిధిలో అధికార యంత్రాంగం సమగ్ర ఇంటింటి సర్వేకు రంగం సిద్ధం చేసింది. కేఎంసీ పరిధిలో 24 బృందాలకు రెండు రోజులపాటు శిక్షణ పూర్తి చేసిన అధికారులు, క్షేత్రస్థాయిలోకి సర్వే సామగ్రి పంపిణీ కార్యక్రమం పూర్తి చేశారు. నగరంలోని 60 డివిజన్ల పరిధిలో మొత్తం 88 వేల నివాసాలను గుర్తించారు. ఆయా నివాసాల్లో 2,64,310 కుటుంబాలు ఉన్నట్టు అధికారులు అంచనాలు వేశారు.


సర్వే సామగ్రి పంపిణీ కార్యక్రమంలో కేఎంసీ ఉద్యోగులు

88 వేల నివాసాలు.. 2.64లక్షల కుటుంబాలు..

- నగరంలో సమగ్ర ఇంటింటి సర్వేకు రంగం సిద్ధం
- 965 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజన
- క్షేత్రస్థాయికి చేరుకున్న సర్వే సామగ్రి
- నివాసాలకు ముందస్తుగా స్టిక్కర్లు ఏర్పాటు
- ఆయా వ్యక్తుల రాజకీయ నేపథ్యం వివరాలు కూడా నమోదు

ఖమ్మం సంక్షేమ విభాగం/వైరా, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా 965 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించారు. ప్రతి 175 నివాసాలకు ఒక ఎన్యూమరేటర్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఇప్పటికే 25మంది బిల్ కలెక్టర్లు, 165 మంది మెప్మా రిసోర్స్ పర్సన్‌లతో పాటుగా అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇలా మొత్తం 750 మందికి సర్వేపై శిక్షణ పూర్తి చేశారు. సోమవారం ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేశారు. సర్వేలో మొత్తం 84 అంశాలపై వివరాలు సేకరించనున్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులాల వారీగా సర్వే చేయనున్నారు. ఇళ్లలో పెంచుకొనే కోళ్ల (కోడి, పిల్లలు)నుంచి కార్ల వరకు స్థిర, చర ఆస్తుల వివరాలను నమోదు చేయనున్నారు.

సర్వేకు సన్నద్ధం

ఖమ్మం నగర పాలక సంస్థలోని 965 ఎన్యూమరేషన్ బ్లాక్‌లలో చేపట్టే సర్వేకు కావాల్సిన సామాగ్రిని శనివారం కేఎంసీ కార్యాలయం నుంచి పంపిణీ చేశారు. 60 డివిజన్లలో 6న సర్వే ప్రారంభం కానుంది. ఈ మేరకు పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో సర్వే బృందాలకు హద్దులు చూపించే విధంగా ప్రాంతాలను ఇళ్ల నెంబర్లు హద్దులుగా విభజన చేశారు. తొలి రోజు జరిగే సర్వేకు ప్రజలకు ముందస్తు సమాచారం అందించేందుకు శనివారం రోజునే 60 డివిజన్లలో సర్వే ప్రారంభ ప్రాంతాల్లో ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు.

రాజకీయ నేపథ్యానికి ప్రాధాన్యత

ఈ నెల ఆరోతేదీ నుంచి నిర్వహించే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఆయా వ్యక్తుల రాజకీయ నేపథ్యానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన మాదిరిగానే కొద్దిపాటి మార్పుతో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నది. తాజా సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ అంశాలతోపాటు కులానికి సంబంధించిన అంశం కూడా ప్రధానంగా ఉంది. దాదాపు 74అంశాలపై సర్వే చేయనున్నారు.

వీటిలో రాజకీయ నేపథ్య అంశం కూడా ఉంది. 46(ఎ), 46(బి), 46(సి), 46(డి), 46(ఇ), 46(ఎఫ్), 47నెంబర్ల వారీగా రాజకీయ నేపథ్య వివరాలను సర్వేలో రాబట్టనున్నారు. ప్రజాప్రతినిధిగా పనిచేసిన వివరాలు.. అంటే ప్రజాప్రతినిధిగా సభ్యత్వం ప్రస్తుతం, పూర్వం, అలాగే ఆఫీసు బేరర్(మినిస్టర్, చైర్మన్, స్పీకర్, మొదలగు) ప్రస్తుతం, పూర్వం. ఎన్ని టర్మ్‌లు, ప్రజాప్రతినిధిగా పనిచేసిన మొత్తం సంవత్సరాలు. అదేవిధంగా నామినేటెడ్/కార్పొరేషన్/బోర్డు/సహకార సంఘం/ ప్రభుత్వయేతర సంస్థల్లో సభ్యులు/సంఘ సభ్యులు అయితే వివరాలు సర్వేలో రాబట్టాల్సి ఉంది. అంతేకాకుండా ఈ సర్వేలో ఏ కుటుంబం నుంచైనా ఎవరైనా ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలస వెళ్లారా... వెళితే అందుకు గల కారణాలను పొందుపర్చాల్సి ఉంటుంది. మొదట కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగతానికి సంబంధించిన సాధారణ వివరాలు అలాగే ఉద్యోగ, ఉపాధి వివరాలు, భూమి వివరాలు, రిజర్వేషన్ ప్రయోజనాలు, ఇతర వివరాలు, కుటుంబాల స్థిరాస్తి, చరాస్తి వివరాలు, పొందుతున్న ఇతరత్రా సౌకర్యాల గురించి సర్వే చేయనున్నారు.

రిజర్వేషన్ ప్రయోజనాలు, ఇతర వివరాల్లో మాత్రం రిజర్వేషన్ నుంచి పొందిన ప్రయోజనాలు అంటే వాటిలో విద్యాప్రయోజనాలు, ఉద్యోగ ప్రయోజనాలు అలాగే గత ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన మూడు పథకాల వివరాలు అలాగే ఎస్సీ/ఎస్టీ/బీసీ/ ఈడబ్ల్యూఎస్‌కు చెందిన వారైతే ధ్రువీకరణ పత్రం పొందారా... లేదా, డినోట్‌పై చేయబడిన సంచార/పాక్షిక సంచార తెగకు చెందిన వారా(డీఎన్‌టీ) వివరాలను సర్వేలో పొందుపర్చాల్సి ఉంటుంది. ప్రగతి పథం, సకలజనహితం మన ప్రజాప్రభుత్వం అనే నినాదంతో ఈ సర్వేను నిర్వహించనున్నారు.


సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఇంటింటి సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్యుమరేటర్లుగా ప్రైమరీ టీచర్లు
- ప్రతి ఎన్యుమరేటర్ 150 ఇళ్లపైన స్టిక్కరింగ్ చేయాలి
- 5 నాటికి హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ

6


భద్రాచలంలోని గోదావరి తీరాన భక్తుల పుణ్యస్నానాలు


కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక మాసం ప్రారంభం

- శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- గోదావరిలో కార్తీక దీపాలను వదిలిన భక్తులు

6


వినోభానగర్‌లో పనులను అడ్డుకున్న రైతులు

సీతారామ కాల్వ పనుల అడ్డగింత

- న్యాయం చేయాలని నిర్వాసితుల డిమాండ్
- భద్రాద్రి జిల్లా వినోభానగర్‌లో ఘటన

జూలూరుపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీతారామ లింక్‌కెనాల్ నిర్మాణంతో భూములను కోల్పోయిన నిర్వాసితులకు ఎకరానికి రూ.25లక్షల చొప్పున పరిహారాన్ని చెల్లించాలని కోరుతూ శనివారం భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామంలో బాధిత రైతులు సీతారామ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఖమ్మం జిల్లా ఏన్కూరుకు వచ్చిన సందర్భంలో వినోభానగర్ గ్రామానికి చెందిన భూ నిర్వాసితులందరం వారిని కలిసి ఎకరానికి రూ.30లక్షల పరిహారం చెల్లించాలని కోరడం జరిగిందని, వారు రూ.20లక్షలు చెల్లిస్తామని హామీ ఇవ్వగా తాము రూ.25లక్షలు కావాలని కోరినట్టు తెలిపారు. భూములు కోల్పోయిన రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి మెరుగైన పరిహారాన్ని అందించేలా కృషి చేస్తామని మంత్రులు హామీ ఇవ్వగా ఇప్పుడు పట్టా భూములకు ఎకరానికి రూ.13.50లక్షల చొప్పున, పట్టాలేని ఎస్టీ, బీసీ రైతులకు వేర్వేరుగా ప్రభుత్వం పరిహారం ప్రకటించిందని అధికారులు చెప్పారన్నారు. ప్రభుత్వం అరకొరగా పరిహారాన్ని చెల్లించి తమకు అన్యాయం చేయాలని చూస్తోందని వారు ఆరోపించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులకు న్యాయం చేయాలని, లేదంటే తమకు ఆత్మహత్యే గతని వారు హెచ్చరించారు.

ఊరికి ఉపకారులు

- ఊరు చిన్నదైనా.. దాతృత్వం గొప్పది
- ప్రభుత్వ భవనాలకు విలువైన స్థలాల దానం

7

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించండి

- ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములను గుర్తించాలి
- తాలు పేరుతో కోతలు పెట్టొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

6

కేయూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ ప్రారంభం

- రెండు రోజులపాటు కొనసాగనున్న క్రీడలు
- కేయూ పరిధి జిల్లాల నుంచి హాజరైన 250మంది క్రీడాకారులు

7


వీడియోకాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించండి

- ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములను గుర్తించాలి
- తాలు పేరుతో కోతలు పెట్టొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మంత్రి సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా కొనుగోలు జరిగేలా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందన్నారు. ఈ ఏడాది సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిందని తెలిపారు. రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపుకోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్‌మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వకుంటే జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరమైన మేర గోదాములను గుర్తించాలన్నారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయం నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 323ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు, గన్ని బ్యాగులు, టార్పలిన్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

అనంతరం భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాల్లో రెండు రోజుల్లో డబ్బులు జమ అయ్యేలా అధికారులుచర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడీవోసీ కార్యాలయం నుంచి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, సీపీవో సంజీవరావు, పౌర సరఫరాల అధికారి త్రినాథ్‌బాబు, డీఎం నరేందర్, డీసీవో ఖుర్షిద్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మార్చి 2025 నాటికి
నరేగా పనులు పూర్తి చేయాలి

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్చి 2025 నాటికి నరేగా (నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీం) కింద మంజూరు చేసిన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం మంత్రి, హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి నరేగా పనులు, ఇందిరా మహిళా శక్తి, రోడ్డు నిర్మాణ పనులపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పనుల కింద మంజూరైన పనులు గ్రామాల్లో త్వరగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం మంజూరు చేసిన నిధులను మార్చి, 2025లోపు ఖర్చు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు అవసరమైన రోడ్డు నిర్మాణపనులను పొలంబాట కార్యక్రమం కింద చేపట్టాలని, అవసరమైన మొక్కలు నర్సరీలో పెంచాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో సన్యాసయ్య, అడిషనల్ డీఆర్డీవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

పుల్లయ్య కుటుంబ సభ్యులకు
కేటీఆర్ ఫోన్

అండగా ఉంటామని హామీ

చింతకాని, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబ సభ్యులతో శనివారం ఫోన్‌లో మాట్లాడారు. పొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో ఇటీవల రైతుల మృతి అనంతరం చోటు చేసుకున్న ఘటనలు, పుల్లయ్య అరెస్టుకు గల కారణాలను అడిగితెలుసుకున్నారు. కుటుంబసభ్యుల యోగక్షేమాలపై ఆరాతీశారు. అండగా ఉంటామని, బీఆర్ఎస్ లీగల్ టీం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. త్వరలోనే పుల్లయ్యను కలుస్తానని తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వులు
అమలు పరచాలి

సత్తుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కమ్యూటెడ్ వేల్యూ ఆఫ్ పెన్షన్ అమలు విషయంలో హైకోర్టుకు వెళ్లి అనుకూల ఉత్తర్వులు పొందిన వారికి ట్రెజరీ అధికారులు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ఎస్‌టీవో ఎల్లయ్యను శనివారం కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ విరమణ తరువాత పొందిన కమ్యూటేషన్ మొత్తాన్ని ఇప్పటివరకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెన్షనర్ రిటైరైన తరువాత 15 ఏళ్ల సమాన మొత్తాల్లో ప్రభుత్వానికి తిరిగి చెల్లించే వారని, పెరిగిన వడ్డీ రేట్ల ప్రకారం పెన్షనర్లు తిరిగి అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తుండటంతో హైకోర్టును ఆశ్రయించారన్నారు. వీరికి అనుకూలంగా కోర్టు 12 సంవత్సరాల 4నెలల వరకే కమ్యూటెడ్ వేల్యూ ఆఫ్ పెన్షన్ (సీవీపీ) మినహాయించాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. జిల్లా నుంచి 71మంది హైకోర్టు అనుకూల ఉత్తర్వులు పొందగా వీరిలో సత్తుపల్లికి చెందిన వారు ఏడుగురు ఉన్నామన్నారు. మాకు హైకోర్టు ఇచ్చిన సీవీపీ మినహాయింపును తక్షణమే అమలు పరచాలని సంఘ బాధ్యులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, ఏఎస్.ప్రకాశరావు, సత్యనారాయణ, బోడేపూడి బాబు, జయరాజు, వెంకట నారాయణలు కోరారు.

మద్యం పట్టివేత

కారేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న రూ.50 వేల విలువగల మద్యాన్ని శనివారం రాత్రి కారేపల్లి ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పట్టుకున్నారు. ఖమ్మం సమీపంలోని ఓవైన్‌షాపులో ఆరు పెట్టెల మద్యం బాక్స్‌లను కారులో తరలిస్తుండగా సమాచారం అందుకున్న సిబ్బంది కారేపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో పట్టుకుని మద్యం, కారును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ స్రవంతి, ఎస్ఐ వసంతలక్ష్మి తెలిపారు.


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

పీజీ కళాశాలను సందర్శించిన
రిజిస్ట్రార్ మల్లారెడ్డి

ఖమ్మం, ఖానాపురం హవేలి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శనివారం సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. అధ్యాపకులు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యాభివృద్ధిలో అధ్యాపకులే కీలకమన్నారు. పరిశోధనాత్మక బోధనలతో ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు ప్రవేశాల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్ బోర్డుసెక్రటరీ వై.వెంకయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

33 మంది ప్రత్యేక ఉపాధ్యాయులకు
నియామక పత్రాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన డీఎస్సీ 2024లో ప్రత్యేక ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన 33మంది అభ్యర్థులకు శనివారం నగరంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జడ్పీ డిప్యూటీ సీఈవో నాగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మలు నియామక పత్రాలు అందించారు. 26మంది ఎస్‌జీటీలకు స్థానిక సంస్థల పాఠశాలలో 24మందికి, ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరికి, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లకు స్థానిక సంస్థల్లో ఆరుగురికి, ప్రభుత్వ పాఠశాలలో ఒకరికి ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో రాజశేఖర్, సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రావణికి నియామక పత్రం అందిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో, డీఈవో


యోగాసనాల ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎస్‌జీఎఫ్ స్కేటింగ్, యోగా క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్- 14, 17 బాల, బాలికల స్కేటింగ్, యోగా జట్లతో పాటు అండర్-14 బాలుర, బాలికల హ్యాండ్‌బాల్ జట్లను శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 180 మంది క్రీడాకారులు హాజరైనారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తెలిపారు. ఎంపికలను పీడీ శ్రీనివాస్, స్కేటింగ్ కోచ్ సురేష్, హ్యాండ్‌బాల్ కోచ్ క్రిష్ణయ్య, సైదేశ్వరరావు, క్రిష్ణ , శివ పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు సమీక్షించారు.

నేడు ఇద్దరు మంత్రుల రాక

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి తుమ్మల ఉదయం 10 గంటలకు హనుమకొండలో బయలుదేరి 12 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. చెరుకూరి వారి మామిడితోటలో ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమ్మేళనంలో పాల్గొంటారు. అనంతరం పొలేపల్లి, ఇల్లెందులో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మంత్రి పొంగులేటి ఉదయం 10 గంటలకు హనుమకొండలో బయలుదేరి మధ్యాహ్నం 12గంటలకు ఖమ్మం రూరల్ మండలం కొండాపురం చేరుకుంటారు. అక్కడ నుంచి రెడ్డిపల్లి, ఖమ్మంలోని చెరుకూరి మామిడితోటలో ఉద్యోగుల సమ్మేళనం, తర్వాత ఇల్లెందు, ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన కళావతిబాయి


బాధ్యతలు చేపట్టిన కళావతి భాయిని అభినందిస్తున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా కళావతిబాయి శనివారం బాధ్యతలను చేపట్టారు. కార్యాలయానికి వచ్చిన ఆమెకు చాంబర్‌లో పూర్వపు డీఎంహెచ్‌వో డాక్టర్ వి. సుబ్బారావు చార్జ్‌ను అప్పగించారు. అనంతరం ఆమెను అభినందించారు. బాధ్యతలు చేపట్టిన కళావతిబాయిని పలువురు అధికారులు, కార్యాలయం సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. సైదులు, డాక్టర్ చందూనాయక్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ మోత్యా, సాంబశివరెడ్డి, నవీన్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ
మెరుగైన వైద్యసేవలందించాలి

- రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రమీలాదేవి


హోమియో వైద్యశాలను సందర్శించిన రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

తల్లాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆయూష్ హోమియో వైద్యశాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలని ఆయూష్ శాఖ వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రమీలాదేవి ఆదేశించారు. శనివారం తల్లాడలోని హోమియో వైద్యశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హెర్బల్ గార్డెన్, యోగా కేంద్రం, రికార్డులను పరిశీలించారు. వైద్యం కోసం వచ్చిన రోగులను వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. హోమియో వైద్యశాలలో ఎంఎన్‌వో, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గడల రాంప్రసాద్ పాల్గొన్నారు.

కార్తీకమాసం ప్రారంభం

- శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- గోదావరిలో కార్తీక దీపాలను వదిలిన భక్తులు

భ ద్రాచలం,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రసిద్ధ పుణ్య క్షే త్రమైన భ ద్రాచలంలో భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి గోదావరిలో కార్తీక దీపాలను వదిలారు. అనంతరం శివాలయాల్లో జరిగే ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. స్థానిక శ్రీ అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.చి త్రకూట మండపంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్యదేవుని వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో ఆర్జిత సేవగా నిర్వహించారు. అలాగే పలువురు భక్తులు శివాలయంలో శివ దీక్షను స్వీకరించగా వారికి ఆలయ అర్చకులు అయిలూరి సుబ్రమణ్యేశ్వర శర్మ దీక్షా ధారణ గావించారు. ఇదే క్రమంలో భక్తులు శివాలయంలో స్వామి వారి దర్శనం అనంతరం భ ద్రా ద్రి రామయ్య దర్శనం చేసుకున్నారు. అలాగే ఈ సారి దేవస్థానం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్య క్రమాలలో భాగంగా లలితా సహ స్ర నామ పారాయణం,వాణీరాంచే భక్తిసంగీతం నిర్వహించారు. అదే విధంగా అభినయ కూచిపూడి నాట్యాలయం వారిచే నాట్య ప్రదర్శన నిర్వహించారు.

శివకేశవులను ఆరాధించటం శ్రేష్ఠం

కార్తీక మాసంలో శివకేశవులను ఆరాధించటం ఎంతో శ్రేష్ఠమని భ ద్రా ద్రి దేవస్థానం వేదపండితుడు ద్వివేదుల సత్యసాయి సన్యాసిశర్మ అన్నారు. కార్తీక మాస ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం నుంచి ప్రవచన కార్య క్రమాన్ని భ ద్రా ద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.



ఈ సందర్భంగా సన్యాసిశర్మ కార్తీక మాస ప్రాశస్త్యాన్ని వివరించారు. సూర్యోదయ పూర్వం స్నానం, అర్చనం, జ్యోతి ఎంతో ప్రధానమని అన్నారు. సమస్త దేవతలు నీటిలోనే ఉంటారని ఈ క్రమంలో బ్రహ్మీ ముహూర్తంలో స్నానమాచరించటం పరమాత్ముని జ్యోతి స్వరూపంగా ఆరాధించటం ఎంతో మంచిదన్నారు.

ఇంటింటి సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్యుమరేటర్లుగా ప్రాథమిక పాఠశాలల టీచర్లు
- ప్రతి ఎన్యుమరేటర్ 150 ఇళ్లపైన స్టిక్కరింగ్ చేయాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈవోలు సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటింటి సర్వే సన్నద్ధత, ధాన్యం, పత్తి కొనుగోళ్లపై ఆమె సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు ప్రాథమిక పాఠశాల టీచర్లను ఎన్యుమరేటర్‌లుగా వినియోగించాలని ఆదేశించారు. పాఠశాలలో ఉదయం ఒక పూట పని చేయాలని, మధ్యాహ్నం నుంచి ఎన్యుమరేషన్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. సెలవు రోజుల్లో పూర్తి స్థాయిలో ఎన్యుమరేషన్ నిర్వహించాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లను మండలాల వారీగా 10 శాతం రిజర్వ్ నియమించి, వారికి శిక్షణ ఇవ్వాలని ఆమె సూచించారు. ప్రతి సూపర్ వైజర్ పరిధిలో ఒక రిజర్వ్ బృందం ఉండాలని అన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ తన పరిధిలో 150 ఇండ్లు ఎక్కడ ఉన్నాయో చూసి, ఇంటి పైన స్టిక్కర్ అతికించాలని, హౌస్ లిస్టింగ్ ప్రక్రియతో స్టిక్కరింగ్ కూడా జరగాలని సూచించారు. ఈ నెల 5 నాటికి హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలని తెలిపారు. 6, 7 తేదీలలో రెండవ విడతగా ఎన్యుమరేటర్ లకు, డేటా ఎంట్రీ బృందాలకు శిక్షణ నిర్వహించాలని అన్నారు. ఒక సూపర్ వైజర్ పరిధిలో కనీసం ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు నియమించాలని అన్నారు.

జిల్లాలో సరిహద్దు మండలాల పరిధిలో చెక్ పోస్టుల వద్ద అధికారులకు డ్యూటీలు కేటాయించాలన్నారు. జిల్లాలో 5 మండలాల పరిధిలో ఉన్న 9 పత్తి కొనుగోలు కేంద్రాలను ఆయా మండలాల తహసీల్దార్‌లు సందర్శించి రిపోర్ట్ అందించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేలా జిల్లా మార్కెటింగ్ అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు, ఎన్యుమరేషన్‌లో ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఉంటే 1077 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ వీడియో సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సీపీవో ఏ. శ్రీనివాస్, డీఈవో సోమశేఖర శర్మ, డీఆర్డీవో రాజేశ్వరి, ఆర్డీఓలు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి అధికారులు, మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపీఓలు, ఎంఎస్‌వోలు, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన సేవాదళ్

- సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి దయాకర్

దమ్మపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉండగా సేవాదళ్ కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషిచేసారని అన్నారు. దమ్మపేటలో ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించగా సమావేశానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ పలు సేవా కార్యక్రమాలలో సేవాదళ్ సభ్యులు పాల్గొంటున్నారని, పార్టీ నిర్వహించే కార్యక్రమాలను ప్రజలలో తీసుకువెళ్లి చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. సేవాదళ్ కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించాలని దయాకర్ కోరారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ నియోజకవర్గంలో సేవాదళ్ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పించటంతో పాటు సహకారం అందిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జరిగే కార్యక్రమాలకు సేవాదళ్ సభ్యులు సహకారం తీసుకుంటామన్నారు. కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.


మాట్లాడుతున్న కొదుమూరి దయాకర్

వివాహిత ఆత్మహత్య

తిరుమలాయపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంతో ఓ వివాహిత మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో జరిగింది. మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన వీరబోయిన నవ్య(23) వ్యవసాయకూలీ శుక్రవారం తన భర్త శ్రీశైలంతో గొడవ జరిగింది. గొడవ అనంతరం శ్రీశైలం తన పొలంలో అరక దున్నేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన నవ్య బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికొచ్చి చూడగా నవ్య కనిపించకపోవటంతో బంధువులను అడిగి తెలుసుకున్నాడు. ఎవరిదగ్గరకు వెళ్లకపోవడంతో వెతకసాగాడు. శనివారం వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. మృతురాలికి 4సంవత్సరాల కుమార్తె, 2సంవత్సరాల బాబు ఉన్నాడు. ఈ మేరకు మృతిరాలి భర్త శ్రీశైలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లెందు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు అందించేందుకు దళారుల దోపిడీని నివారించడానికి అధికారులు కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన నిరు పేదలందరికి పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కారేపల్లిలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల రైతులకు గిట్టుబాటు ధరలు లభించేందుకు ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బానోత్ రాంబాబు అధ్యక్షుడిగా ఏర్పాటు చేసిన పాలక వర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, వైరా, పినపాక ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు పాల్గొంటరని తెలిపారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు డానియాల్, పులి సైదులు పాల్గొన్నారు.

'సిండికేట్ మోసాన్ని అరికట్టాలి'

ఏన్కూరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఏన్కూరు, జూలూరుపాడు ఏజెన్సీ మండలాల్లో పెసా చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, పత్తి కొనుగోలు కేంద్రాల్లో గిరిజనేతర్ల సిండికేట్ మోసాన్ని అడ్డగించాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రతి కొనుగోలు కేంద్రాలను గిరిజనేతరులు సిండికేట్‌గా ఏర్పాటై తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దళారీ వ్యవస్థపై పెసా యాక్టు చట్ట ప్రకారం శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, సీసీఐ కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల నుంచి క్వింటా పత్తి రూ.13,000కు కొనుగోలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాగేశ్వరరావునాయక్, గోపికృష్ణ, బాప్ సింగ్‌నాయక్, సాయినాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.


గ్రామపంచాయతీ కార్యాలయ భవనం


కోదండ రామాలయం


బీసీ కమ్యూనిటీ హాల్

ఊరికి ఉపకారులు

- ఊరు చిన్నదైనా.. దాతృత్వం గొప్పది
- ప్రభుత్వ భవనాలకు విలువైన స్థలాల దానం

తల్లాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అదొక చిన్న గ్రామం.. దాతృత్వంలో ఆదర్శంగా నిలిచింది. దేవాలయం, పాఠశాల, పంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన విలువైన స్థలాలను దాతలు దానమిచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం మంగాపురం గ్రామజనాభా 726మంది. ఐదేళ్ల క్రితం మంగాపురం ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. మంగాపురం పరిధిలో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల, కోదండ రామాలయం, గ్రామపంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలాలు ఇచ్చేందుకు దాతలు ముందుకొచ్చారు. ప్రాథమికోన్నత పాఠశాలకు గాదె వెంకట్రామయ్య-నర్సమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు గాదె లక్ష్మీనారాయణ, కొండయ్య, కృష్ణమూర్తి, సత్యనారాయణ, వెంకటయ్య, చంద్రరావులు సుమారు ఐదు కుంటల స్థలాన్ని దానమిచ్చారు. కోదండ రామాలయం, బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పత్తిగడప నారాయణరాజు-అన్నపూర్ణమ్మ దంపతుల జ్ఞాపకార్థం పత్తిగడప రామకృష్ణరాజు-లక్ష్మీ దంపతులు, గాదె లక్ష్మీనారాయణ-భాగ్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు గాదె సీతరామయ్య, భాస్కర్‌రావు, మోహన్‌రావుసుమారు మూడుకుంటల స్థలాన్ని దానమిచ్చారు. గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి నంబూరి చిన్నదర్గయ్య, లాలయ్యల జ్ఞాపకార్థం నంబూరి నాగేశ్వరరావు, నర్సింహారావు, శ్రీనివాసరావు, వీరభద్రం, కృష్ణమూర్తి, పసుమర్తి పిచ్చయ్యలు సుమారు ఐదు కుంటల స్థలాన్ని దానమిచ్చారు. మంగాపురం గ్రామంలో ఒక్కో కుంట విలువ రూ.మూడులక్షలకుపైగా ఉంది. ప్రాథమికోన్నత పాఠశాల, కోదండ రామాలయం, బీసీ కమ్యూనిటీ హాల్, గ్రామ పంచాయతీ కార్యాలయం భవనాలకు సుమారు రూ.40లక్షల విలువైన స్థలాలను దానమిచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. వీటితోపాటు కోదండ రామాలయం పునర్నిర్మాణానికి పత్తిగడప రామకృష్ణరాజు ఆధ్వర్యంలో వారి బంధుమిత్రులు కలిసి సుమారు రూ.పదిలక్షలు విరాళంగా అందజేశారు.


దాతల దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

జన్మభూమి అభివృద్ధికి సహకరించాం

జన్మభూమి అభివృద్ధికి సహకరించటం అదృష్టంగా భావిస్తున్నాను. గ్రామాభివృద్ధికి నావంతుగా కోదండ రామాలయం, బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాలు దానంగా ఇచ్చాము. గ్రామంలో అభివృద్ధి జరగాలన్నదే మా ఆకాంక్ష. కోదండ రామాలయం నిర్మాణానికి బంధుమిత్రులం రూ.పదిలక్షలు విరాళంగా అందజేశాం.


పత్తిగడప రామకృష్ణరాజు

దాతల సహకారం అభినందనీయం

గ్రామంలో ప్రభుత్వస్థలాలు లేకపోవడంతో పాఠశాల, గ్రామపంచాయతీ కార్యాలయం, బీసీ కమ్యూనిటీ హాల్, కోదండ రామాలయం పునర్నిర్మాణానికి స్థలం కొరత ఏర్పడింది. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు దాతలు ముందుకొచ్చి సుమారు రూ.40లక్షలు విలువచేసే స్థలాలు ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించటం అభినందనీయం.


దుగ్గిదేవర నర్సింహారావు

నేడు ఖమ్మంలో 12 గంటల 'నిర్విరామ గానం'

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్విరామ గాన కార్యక్రమం జరుగనుంది. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ పాటల కార్యక్రమం కొనసాగుతుంది. బాపట్లకు చెందిన నాగశ్రీ అనే గాయకురాలు పాటలు పాడటంలో రికార్డు నమోదు కోసం ఖమ్మంను వేదికగా ఎంచుకున్నారు. ఖమ్మంలో కళాదరణ దృష్ట్యా అక్కడ ప్రదర్శణ ఇవ్వబోతున్నట్లు ఆమె చెప్పారు.

గతంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో 30 గంటల పాటు నిర్విరామ గాన ప్రదర్శణతో వండర్ రికార్డులో చోటు సాధించిన నాగశ్రీ ఇప్పుడు విశ్వం అనే సంస్థ రికార్డు కోసం 12 గంటలపాటు సుదీర్ఘ గానాలాపన చేయబోతున్నారు.

'కేయూ' అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ ప్రారంభం


పరుగు పోటీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధి అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైనాయి. పోటీలకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలలోని డిగ్రీ, పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫార్మసీ, ఇంటగ్రేటెడ్ కళాశాలల నుంచి సుమారు 250 మంది పురుషులు, మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు మొదటి రోజు 100, 400, 4x100, 1500, 10000 మీటర్ల పరుగు పోటీలతో పాటు డిస్కస్‌త్రో షాట్‌ఫుట్, లాంగ్‌జంప్ విభాగాలలో పోటీలు నిర్వహించారు.

అంతకు ముందు కార్యక్రమంలో పోటీలను కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ ప్రొఫెసర్ వెంకయ్య, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరావు, అధ్యాపకులు పి. కోటి, ఏటీటీ ప్రసాద్, ఎ. వీరన్న, వెంకట్, అమర్నాథ్, అథ్లెటిక్స్ అకాడమీ కోచ్ గౌస్ తదితరులు ఉన్నారు.

క్రైం సమాచారం

కళ్లల్లో కారం కొట్టి..

- భార్యాభర్తలపై గొడ్డలి, కత్తులతో దాడి
- రావికంపాడు శివారులో పోడు భూముల వివాదం

చంద్రుగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూలీలతో కలిసి చేలో పత్తి తీస్తున్న భార్య, భర్తలపై పక్క చేను వారు కళ్లల్లో కారం కొట్టి గొడ్డలి, కత్తులతో దాడి చేసిన ఘటన చంద్రుగొండ మండలం రావికంపాడు శివారులో శనివారం చోటు చేసుకుంది. భూవివాద నేపథ్యంలో జరిగిన ఈ దాడిపై కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం రావికంపాడు పంచాయతీ దుబ్బతండాకు చెందిన బాణోత్ బాలు అతడి భార్య లక్ష్మీ కొందరు కూలీలను తీసుకొని పట్టా పొందిన పోడు భూమిలో సాగుచేసిన పత్తి తీసేందుకు వెళ్లారు. కూలీలతో పత్తి తీస్తుండగా పక్కచేనుకు చెందిన భుక్యా భీముడు తన కుటుంబ సభ్యులైన భుక్యా సురేష్, శాంతి, జ్యోతి కలిసి బాలు, లక్ష్మిపై కారం చల్లి గొడ్డలి, కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో భార్య భర్తలకు గాయాలయ్యాయి. బాలు కుమారుడు హనుమంతు రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ జి. స్వప్న తెలిపారు.

బాధితుడు బాణోత్ బాలు, భుక్యా భీముడు ఇరువు కలిసి పోడు కొట్టారు. పంపిణి, పట్టా పొందే విషయంలో ఇరువురికి విభేదాలు ఏర్పడ్డాయి. ఈ వివాదం 2001 నుంచి కొనసాగుతోంది. పలు మార్లు గ్రామ పెద్దలు పంచాయితీ చేసినా పరిష్కారం కాలేదు. కాగా గత ప్రభుత్వంలో జరిగిన పట్టాల పంపిణీలో భీముడుకి అనుకూలంగా వ్యవహరించి ఎక్కువ భూమికి హక్కు కల్పించి నాకు అన్యాయం చేశారంటూ బాలు రావికంపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట పురుగులమందు తాగటంతో పాటు గ్రామ కార్యదర్శిపై పురుగుల మందు చల్లాడు. అప్పటి నుంచి కొనసాగుతున్న వివాదంమే దాడికి కారణమైయిందని గ్రామస్థులు తెలిపారు.

డీసీఎం వ్యాను ఢీకొని మహిళ మృతి

ఖమ్మంక్రైం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): డీసీఎం వ్యాను ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన చింతల సుజాత(39) అనే మహిళ చికెన్ తీసుకొచ్చేందుకు శనివారం సాయంత్రం సమయంలో తన ద్విచక్రవాహనంపై షాపనకు వెళ్లేందుకు బయటకు వచ్చింది. మెయిన్‌రోడ్డు వద్దకు వచ్చి షాపు వద్ద ఆగుతుండగా వెనుక నుంచి ఏపీ23వై4816 నెంబరు గల డీసీఎం వ్యాను ఢీకొట్టింది. దీంతో మహిళ వ్యాను టైరు కింద పడడంతో తల నుజ్జునుజ్జయి మృతిచెందింది. ఈఘటనపై భర్త చింతల రవి ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు.. కేసు నమోదు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసిన సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. త్రీటౌన్ సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని త్రీటౌన్ పరిధిలో ఓ మహిళా స్నానం చేస్తుండగా ఆ ప్రాంతానికి చెందిన యువకుడు వీడియో తీసేందుకు సన్నద్ధమయ్యాడు. దీంతో ఆ శబ్దం రాగా ఆ మహిళా అప్రమత్తమై కేకలు వేసి కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలిపింది. దీంతో త్రీటౌన్ పోలీసులను కుటుంబ సభ్యులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ యువకుడిని గుర్తించి అతడా వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఓఈఆర్ పెరుగుదలతో భారీగా
పెరిగిన పామాయిల్ గెలల ధర

- మలేషియా ఆయిల్ రికవరీ రేట్ చేరువలో తెలంగాణ ఓఈఆర్
- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర పామాయిల్ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్

దమ్మపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారం, ఆయిల్‌ఫెడ్ అధికారుల కృషితో ఆయిల్‌ఫెడ్ గెలల ధర భారీగా పెరిగిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పామాయిల్ అడ్వైజరీకమిటీ మెంబర్, రాష్ట్రపామాయిల్ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్ర ప్రసాద్ అన్నారు. అప్పారావుపేట పామాయిల్ కర్మాగారంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్(ఓఈఆర్) పెరుగుదలకు కృషి చేసిన ఆయిల్‌ఫెడ్ అధికారులను పామాయిల్ రైతులు, రైతు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధరకల్పించేందుకు పలు మార్లు కేంద్రప్రభుత్వం, కేంద్రవ్యవసాయశాఖ మంత్రి దృష్టికి రాష్ట్ర పామాయిల్ సంఘం ఆధ్వర్యంలో సమస్యలు తీసుకెళ్లడంతో స్పందించి కేంద్రప్రభుత్వం దిగుమతి చమురుపై 27శాతం పైగా దిగుమతి సుంకం పెంచటంతో రైతులకు టన్నుకు దాదాపు రూ.27 00 పెరుగుదల వచ్చిందని అన్నారు. ఆయిల్‌ఫెడ్ అధికారుల కృషి ఫలితంగా ఓఈఆర్ 19.40శాతం పెరగటంతో పామాయిల్ గెలల ధర భారీగా పెరిగి ప్రస్తుతం రూ.19,144లు చేరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పాటు పామాయిల్ రైతైన తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ మంత్రి కావటంతో పామాయిల్ రైతులకు మేలు చేసేలా మంత్రి తుమ్మల కృషి చేశారని పలువురు కొనియాడారు. పామాయిల్‌కు ఎంఎస్పీ వచ్చే విధంగా మంత్రి తుమ్మల కృషి చేస్తున్నారని, ఇది అమలైతే పామాయిల్ రైతులకు మరింత ఆర్థికవెసులబాటు లభిస్తుందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు జీఎం సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో పాటు రైతుల సహకారంతో అత్యధికంగా వోఈఆర్ సాధించినట్లు తెలిపారు. వచ్చేనెలలో పామాయిల్ ధర రూ.20వేలకు చేరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం అయిల్‌ఫెడ్ అధికారులు డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు కళ్యాణ్, నాగుబాబు, పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్‌ను, ఎమ్మెల్యే జారే ఆదినారాయణను రైతులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పామాయిల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటగిరి శీతారామస్వామి, డైరెక్టర్ దారా యుగంధర్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, రావు గంగాదర్‌రావు, పైడి వెంకటేశ్వరరావు, సీమకుర్తి వెంకటేశ్వరరావు, చిన్నంశెట్టి యుగంధర్, కేవీ సత్యనారాయణ, గుత్తారాజా, దారా మల్లికార్జునరావు, బద్దే కోటేశ్వరరావు, శ్రీరాముల ప్రసాద్, చామర్తి గోపీశాస్త్రి, ఎంపీపీ సోయం ప్రసాదు, కక్కిరాల రమేష్ పాల్గొన్నారు.

కులగణన సర్వేను విజయవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సక్రమంగా నిర్వహించి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య కోరారు. శనివారం కొత్తగూడెం కేసీవోఏ క్లబ్‌లో కుల గణన సర్వేపై అవగాహన , విస్తృత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వే వృథా అయిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న కుల గణన సర్వే పకడ్బందీగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు పొదెం వీరయ్యను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎడవల్లి కృష్ణ, ఏనుగుల అర్జున్‌రావు, మోతుక్కూరి ధర్మరావు, జెలీల్, బిక్కసాని నాగేశ్వరరావు, అల్లాడి నరసింహారావు, ఏలూరి కోటేశ్వరరావు, గడ్డం రాజశేఖర్, అజ్మీర సురేష్‌నాయక్, ఆంథోటీ పాల్, గిడ్ల పరంజ్యోతి రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన

జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ అవగాహన, విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఆవేదనను వేదికపై వెల్లగక్కారు. ఈ క్రమంలో గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారం ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన జిల్లా ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులకు సముచిత స్థానం కల్పించాలని, ఈ సమస్యను ఏఐసీసీ, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు కోరారు.

సీహెచ్‌పీల సామర్థ్యం పెంచాలి

- సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్న కోల్ హ్యాండ్లింగ్ (సీహెచ్‌పీ) మరింత సమర్థంగా పని చేయాలని, ప్రస్తుత 80 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సామర్థ్యాన్ని 100 మిలియన్ టన్నులకు చేరే దిశగా కృషి జరపాలని సింగరేణి సీఎండి ఎన్. బలరాం ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణిభవన్‌లో జరిగిన సీహెచ్‌పీలు, భారీ యంత్రాల పని తీరుపై సమీక్ష జరిపారు. సింగరేణి సంస్థ రానున్న కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోనుందని సీహెచ్‌పీల సామర్థ్యాన్ని కూడ క్రమంగా పెంచాల్సి ఉందన్నారు. ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా 11 భారీ సీహెచ్‌పీలు ఉన్నాయని, వీటికి అదనంగా మరో 2 సీహెచ్‌పీలు, ఒక సైడింగ్ ఏడాదిలోగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఈఅండ్‌ఎం ఆపరేషన్స్ డి. సత్యనారాయణరావు, డైరెక్టర్ పీపీ అండ్ పర్సనల్ జి. వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

చార్జీల పెంపుపై హర్షం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహం విద్యార్థులు వినూత్నంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడు నిరసనలు జరిగే ఎస్సీ కాంప్లెక్స్ వసతిగృహం ప్రాంతంలో ముఖ్యమంత్రితో పాటుగా ఉప ముఖ్యమంత్రి, క్యాబినేట్‌లోని అందరి మంత్రుల చిత్రపటాలతో ప్రదర్శనలు చేయటం విద్యార్థుల తల్లిదండ్రుల్లోను సంతోషాన్ని నింపింది. నగరంలోని ఎస్సీ బీ బాలుర వసతిగృహం విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలతో వసతిగృహంలో ప్రదర్శనలు చేశారు. కాస్మెటిక్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం ప్రకటన జారీ చేయటంతో విద్యార్థులు హర్షం ప్రకటించారు. క్యాబినేట్‌లోని అందరి మంత్రుల చిత్రపటాలను ప్రదర్శించి వారికి కృతజ్ఞతలు ప్రకటించారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారి కొటపాటి రుక్మారావు మాట్లాడుతూ గతంలో 3నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు రూ.1330, 8, 9, 10 విద్యార్థులకు రూ.1540 కళాశాల విద్యార్థులకు రూ.2100 అందించారని వివరించారు.


సీఎం చిత్రపటాలతో హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

గౌడ కులస్థులు ఐక్యంగా ఉండాలి

- సినీ హీరో సుమన్

పెనుబల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ, పేదవారికి ఆర్థికంగా, విద్యాపరంగా సహకారాన్ని అందిస్తూ కలిసిమెలిసి ముందుకు సాగాలని ప్రముఖ సినీహీరో తల్వార్ సుమన్ గౌడ్ తెలిపారు. వీఎం బంజర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సుమన్ మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో గౌడ కులస్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జైగౌడ్ రాష్ట్ర కన్వీనర్ మొర్ల ఏడుకొండలు, మాజీ ఎమ్మెల్యే వంగా సుబ్బారావు, మాజీ ఎంపీపీలు చింతలపాటి వెంకటేశ్వరరావు, తెల్లారి వెంకటేశ్వరరావు, విగ్రహ దాత వేముల నర్సింహారావు, నిర్మాణ కమిటీ సభ్యులు వంగా గిరిజాపతిరావు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న సినీహీరో సుమన్


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

అన్నివర్గాల సమస్యలపై పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్

సత్తుపల్లి/ బోనకల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజా సమస్యలపై నికరమైన పోరాటాలు సీపీఎం నిర్వహిస్తుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్‌లో జరిగే 22వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సత్తుపల్లిలో నిర్వహించిన ఆహ్వాన సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం బోనకల్‌లో మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మోటమర్రి గ్రామంలో శనివారం జరిగిన ఆ పార్టీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భగా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కిలారు సురేష్, మరో 24మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు..

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్రధాన రహదారి పాత బస్టాండ్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ కోతలు అమలు చేసే ప్రాంతాలను అధికారులు శనివారం ప్రకటించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ప్రకటించారు. సరితా క్లినిక్ సెంటర్, నర్సింహాస్వామి గుడి ప్రాంతం, రేవతిసెంటర్, వైరారోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	54
బీరకాయ	34
పచ్చిమిర్చి	58
కాకరకాయ	38
బెండకాయ	28
పొట్లకాయ	60
దోసకాయ	54-70
గోరుచిక్కుడు	80
నాటుచిక్కుడు	140
క్యాబేజీ	28
దొండ	38-48
సొరకాయ	28
క్యారెట్	64
క్యాప్సికం	88
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	వెనమ్
శ్రీనివాస:	లగ్గం, వెట్టయాన్
సాయిరాం:	విశ్వం
కేపీఎస్:	వెనమ్
తిరుమల:	దేవర

పల్లె దవాఖానా ఏర్పాటు చేయరూ?

- ఇరుకు రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు
- వాక్‌వేలో నిరుపయోగంగా ఆటవస్తువులు
- ఇరుకు స్థలంతో ప్రభుత్వ పాఠశాల
- ఐదో డివిజన్‌లో ఇవీ సమస్యలు

డివిజన్ విజిట్



డ్రెయినేజీ లేని రస్తోగీనగర్ రోడ్డు



వాక్‌వేలో నిరుపయోగంగా చిన్నారుల ఆటవస్తువులు

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని ఐదోడివిజన్‌లో కనీస అవసరాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ పరిధిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం భక్తులతో సందడిగా ఉంటూ ఎల్లప్పుడూ ఆధ్యాత్మికత వెల్లువిరుస్తుంది. డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, యూపీహెచ్ కాలనీ, రస్తోగీ నగర్ 2 ప్రాంతాలు ఉన్నాయి. ఈప్రాంతాల్లో అధికంగా డ్రెయినేజీ సమస్యల తీవ్రవంగాఉంది. వర్షపు నీరు ఇళ్లలో వాడుకున్న నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. రస్తోగినగర్2లో సాగర్ కాలువ కట్టపై వాక్‌వే ఏర్పాటు చేశారు. జిమ్ పరికరాలు, చిన్నారుల ఆట వస్తువులు నిరుపయోగంగా ఉన్నాయి. డివిజన్ పరిధిలోని పాఠశాలలో ఆవరణ తక్కువగా ఉంది. నాలుగో డివిజన్ పరిధిలోని కార్పోరేషన్ పరిధిలోని పార్క్‌స్థలంలో పాఠశాల ఏర్పాటు చేస్తే నాలుగు, ఐదు డివిజన్ పరిధిలోని ప్రజలకు అనుకులంగా ఉంటుంది. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు వేరేవేరుగా ఉంటే విద్యార్థులకు ఆటస్థలం అందుబాటులో ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు.

డివిజన్ స్వరూపం

ఐదోడివిజన్‌కాలనీలు: బాలాజీనగర్, యూపీహెచ్‌కాలనీ, రస్తోగీనగర్ 2
జనాభా: మెత్తం 10వేలమంది, ఓటింగ్ 5260
రేషన్‌షాప్‌లు: మూడు,
అంగన్‌వాడీ కేంద్రాలు నాలుగు.

ప్రధాన సమస్యలు

ఇల్లెందు ప్రధాన రహదారి నుంచి కాలువ కట్ట పక్కన రెండో వీధిలో 30 అడుగుల రహదారి నేడు 12 అడుగులకు చేరింది. ఈ రోడ్డు వెంట వచ్చే వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటంలేదు. ఇంటి ముందు ఉన్న ర్యాంపులు రోడ్డుపైకి రావటంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఈ రోడ్డు చాలాతక్కువ ఎత్తులో ఉండటంతో వర్షాకాలం వర్షపు నీటితోపాటు, ఇళ్లలో వాడుకున్న నీరు రోడ్లపై చేరుతోంది. డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో ఉన్న స్థలం సరిపోవటంలేదు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకేచోట ఉన్నాయి. దీంతో ఇరుకు ఉంది.

వాక్‌వేలలో చెత్తాచెదారం

సాగర్ కాలువకు నిర్మించిన వాక్‌వేలలో చెత్తాచెదారంలో నిండి నడిసేందుకు వీలు లేకుండా ఉంది. నేడు ఇవి ఎందుకు పనికిరాకుండా నిరుపయోగంగా ఉన్నాయి. డివిజన్ పరిధిలో కుక్కల, కోతుల బెడద అధికంగా ఉంది. డివిజన్ పరిధిలో ముఖ్యంగా డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవటంతో సీసీ రోడ్లవెంట మురుగు నీరు ఆగి దోమలు అధికంగా ఉండి రాత్రి నిద్ర ఉండటం లేదు. క్కులు రాత్రి పైట గుంపులు గుంపులుగా వచ్చి రోడ్లపై తిరుగుతు పాదచారులను వాహనదారులను ఇబ్బందులకు గరిచేస్తున్నాయి.

ఇరుకురోడ్లతో సమస్యలు

ఇల్లెందు ప్రధాన రహదారి నుంచి వెంకటేశ్వరస్వామి ఆర్చి పక్కన ప్రభుత్వ భూమి ఉండటంతో ఆ ప్రాంతంలో ఇరుకు రోడ్లు నిర్మించారు. కేవలం 10 అడుగుల రోడ్లు తీసి పట్టాలు అందించారు. ప్రస్తుతం పట్టాదారులు ఈ భూములను మరొకరికి అమ్మేశారు. ఈ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణానికి కావాల్సి సామగ్రి తీసుకెళ్లేందుకు నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేసినా, డ్రెయినేజీ నిర్మాణానికి స్థలం లేకుండాపోయింది.

పనులు పెండింగ్‌లో ఉన్నాయి

పల్లెబోయిన భారతీ చంద్రయ్య కార్పొరేటర్



డివిజన్ పరిధిలో రూ.7కోట్ల అభివృద్ధి పనులు పూర్తిచేశాం. ఇంకా రూ.8కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పల్లెదవఖానా ఏర్పాటు అవసరం ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఏర్పాటుకు కృషిచేస్తా. నాలుగు, ఐదు డివిజన్‌ల ప్రజలకు ఇది ఎంతో అవసరం. డివిజన్ పరిధిలో డ్రెయినేజీ పూర్తిస్థాయిలో లేకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు. కనీస అవసరాలైన సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం అవసరం ఉంది. మంత్రులు, అధికారుల సహకారంతో వాటిని పూర్తిచేస్తా.

కుక్కల బెడదతో ఇబ్బందులు

పోలూరి కృష్ణ, బాలాజీనగర్



ఐదోడివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌లో రోడ్లపై కుక్కలు గుంపులు గుంపులుగా ఉండి రాత్రిపూట బైటకు తిరిగే పరిస్థితి లేదు. కుక్కలు అధికంగా ఉండటంతో పగలు, రాత్రి మహిళలు, చిన్నారులు, వయోవృద్ధులు బైటకు రావాలంటే భయపడుతున్నారు. రాత్రిపూట వాటి అరుపులకు నిద్ర పట్టటంలేదు. కార్పోరేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవట్లేదు.

వాక్‌వేను అందుబాటులోకి తేవాలి

గోగుల శ్రీనివాస్, యూపీహెచ్‌కాలనీ



డివిజన్ పరిధిలోని ఉన్న వాక్‌వేన్‌ను ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలి. వాక్‌వేలో చెత్త, చెట్లను తొలిగించి శుభ్రపరచాలి. జిమ్, ఆట వస్తువులను ఉపయోగించేలా మరమ్మతులు చేపట్టాలి. ప్రజల అవసరాలకు ఏర్పాటు చేసిన వాక్‌వేలు నేడు ఎందుకు పనికిరాకుండా పోయాయి. ఇకనైనా వాటిని శుభ్రపరచాలి.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

రెవెన్యూ మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి



రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి):రైతులు సహకార సంఘాల ద్వారా తీసుకునే పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి కోరారు. శనివారం రాజారాంపేట సహకార సంఘం కార్యాలయంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సహకార సంఘం అధ్యక్షుడు దీరావత్ బాలాజీ అధ్యక్షతన జరిగిన సభలో దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుసంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతుభరోసా, రైతు రుణమాఫీ త్వరలోనే అమలు చేస్తారన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలను పొలాలపై మాత్రమే పెట్టుబడిగా పెట్టాలని, ఇతరత్రా వాడుకోవద్దన్నారు. తొలుత 140 మంది రైతులకు రూ.58లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, ఏఎంసీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, సంఘం అధ్యక్షుడు దీరావత్ బాలాజీ, నాయకులు ఆరెకట్ల గురవయ్య, యడవల్లి సైదులు, సంఘం డైరెక్టర్లు వెంకటరెడ్డి, జయరాజు, కోటేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకుడు కుక్కల హనుమంతరావు, సీఈఓ పమ్మి రామకోటయ్య పాల్గొన్నారు.

నేడు చేకూరి కాశయ్య విగ్రహ ఆవిష్కరణ

- హాజరు కానున్న జిల్లా మంత్రులు
- గురుదక్షణ ఫౌండేషన్ ప్రాంగణంలో విగ్రహాల ఏర్పాటు



ఖమ్మంఖానాపురంహవేలినవంబరు2 (ఆంధ్రజ్యోతి): గురుదక్షణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చేకూరి కాశయ్య, ఉపాధ్యక్షుడు యస్‌వి నారాయణ విగ్రహాలను ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు.అనంతరం డిజిటల్ గ్రంథాలయన్ని ప్రారంభించనున్నారు.ఆయన స్వగ్రామం తక్కెళ్లపాడు. ప్రాథమిక విద్య అక్కడే జరిగింది. మధిర ఉన్నత పాఠశాలలో విద్యానంతరం, హైదరాబాదులో కళాశాల విద్య పూర్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తితో ప్రారంభమై, కొత్తగూడెం సమితి విస్తరణాధికారిగా, సమితి అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఉపాధ్యక్షుడిగా, చివరగా గురుదక్షిణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలలో ఎందరో అభిమానులను పొందగలిగారు. తన పదవీకాలంలో జిల్లాలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్‌లే గాక ఇతర అధికారులందరూ ఎక్కడ ఉన్నా తనను గుర్తుంచుకొని అమితంగా ఆదరించారు. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుతో వారి బంధువులతో గల ఆత్మీయబంధం అందరికి తెలిసిందే. సంపదకోసం ఎన్నడూ తాపత్రయ పడలేదు. తన నిజాయితీకి అది నిలువెత్తు నిదర్శనమైనా చివరకు సొంత ఇల్లైనా లేదన్న లోటు. ఏ పదవిలో ఉన్నా ప్రజలందరి సమస్యలను విని సానుకూలమైన సహకారాన్ని అందించేవాడు. రాజకీయాల నుంచి విరమించిన తరువాత కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితం కావాలని, గురుదక్షిణ ఫౌండేషన్‌ను స్థాపించారు.

పేరు ఎలా వచ్చిందంటే?

మయూరి సెంటర్



ఖమ్మంసాంస్కృతికం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) ఉద్యమాలకు కేంద్రబిందువుగా మయూరి సెంటర్ దశాబ్దాల తరబడి కొనసాగింది.. అనేక దశాబ్దాల పాటు మయూరి సెంటర్ ఆందోళనల అడ్డాగా వెలుగొంది. ఈ సెంటర్ ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నప్పటికీ పదిహేనేళ్ల క్రితం నిత్యాగ్నిగుండంగా ప్రజానినాదాలతో దద్దరిల్లేది.. అయితే ఈ ప్రాంతానికి మయూరి సెంటర్ అనే పేరు మాత్రం ఇక్కడగల ఒక హోటల్ (లాడ్జి) కారణంగా వచ్చింది. ఇది నగరంలో మొదటగా ఏర్పడిన ప్రముఖ కూడలి కావటం విశేషం.. ఈ ప్రాంతంలో ఏర్పాటైన హోటల్ కారణంగా ప్రాంతాన్ని స్థానికలు ఆపేరుతో పిలిచేవారు. పాత బస్టాండ్ నుంచి బస్ డిపోకు వెళ్లే దారిలో ఈ సెంటర్ ఉంది. గతయాభై, అరవయ్యేళ్ల క్రితం మయూరి లాడ్జికి విశేష ఆదరణ ఉండేది. ఇతర ప్రాంతాలనుంచి ఖమ్మం సందర్శించే వారు ఇక్కడే బస చేసేవారు.

మాజీ మంత్రి పువ్వాడ పర్యటన



రాములుకు నివాళులు అర్పిస్తున్న పువ్వాడ

రఘునాథపాలెం,నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. చిమ్మపూడిలో లింగంపల్లి వెంకన్న నివాసంలో జరిపిన అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంపాటి రాములు దశదిన కర్మలోపాల్గొని నివాళులు అర్పించారు. పువ్వాడ ఉదయ్‌నగర్‌లో బత్తుల వెంకటేశ్వర్ల భార్య మరణించటంతో నివాళులు అర్పించారు. శివాయిగూడెంలో ఇటీవల మరణించిన గార్లపాటి కళ్యాణ్, గార్లపాటి విజయ్‌కుమార్ కుటుంబాలను ఓదార్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ గుత్తా రవి, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, దొంతు సత్యానారాయణ, పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, తాతా వెంకటేశ్వర్లు, ముత్తయ్య, సైదులు, భద్రయ్య, శ్రీను, విజయ్, రవి, రాములు, నంద, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డైట్ కాస్మెటిక్ చార్జీల పెంపుపై హర్షం

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు2 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు చొరవ చూపి మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం హర్షనీయమని వివిధ సంఘాల నాయకులు కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఒకేసారి భారీగా మెస్, కాస్మోటిక్ చార్జీలుపెంచడం హర్షనీయమని అన్నారు. పది సంవత్సరాలుగా వివిధ శాఖల ఆధ్వర్యంలోని హాస్టల్ విద్యార్థులు ఎంతగానో ఎదురు చూస్తుండగా డైట్‌చార్జీలను పెంచుతూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వుల విడుదల చేయటం పట్ల జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు ప్రభుత్వానికి కృతజ్ఞతలుతెలిపారు. ఇచ్చిన హామీల్లో భాగంగా విద్యార్థుల డైట్ చార్జీలను 200శాతానికి పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు.ఉత్తర్వులు వెంటనే వెలువడడానికి ముఖ్యకారకులైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి రుణపడి ఉంటామని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు పోతగాని సురేష్‌కుమార్, గాదరి బాబు,గుమ్మడి వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బింగి రమేష్ నాగేశ్వరరావు, వెంకటరావు, కె.నాగేశ్వరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందిస్తున్న రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): నిరుపేద బీటెక్ విద్యార్థికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ల్యాప్‌టాప్ వితరణ చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన బొర్రా కావేరి బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లి,దండ్రులు కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. కావేరికి ల్యాప్‌టాప్ అవసరాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ద్వారా తెలుసుకున్న రాయల నాగేశ్వరరావు శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో లాప్‌టాప్‌ను అందించారు.

అండగా ఉంటాం

వైరా, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటుందని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. చావా హారిక, గద్దే నీరజ సహకారంతో బీటెక్ విద్యార్థిని గద్దే ఉషారాణికి శనివారం సాయిబాబా మందిరంలో డాక్టర్ మురళీకృష్ణ ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

అన్ని పంటలకు మద్దతు ధర: ఏడీఏ



పైనంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్ని పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కలిపిస్తుందని కూసుమంచి ఏడీఏ బి.సరిత పేర్కొన్నారు. శనివారం మండలంలోని దమ్మాయిగూడెం, పాతర్లపాడులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యం అమ్ముకోవాలని మద్దతు ధరతో పాటు రూ.500బోనస్‌గా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం స్పెషలాఫీసర్ సుమన్‌చక్రవర్తి, ఏవో సీతారాంరెడ్డి, ఏపీఎం అలివేలు మంగ, సీసీలు కొండబాల సావిత్రి, బండ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పైనంపల్లి సహకార సంఘం అధ్యక్షుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు రైతులను కోరారు. శనివారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పైనంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాగుబండి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉసిరికాయల లక్ష్మయ్య, సీఈఓ వరగాని జగదీష్, డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

ఖమ్మంటౌన్,నవంబరు2(ఆంధ్రజ్యోతి):నగరంలోని మంచికంటి భవన్‌లో సీపీఎం టూటౌన్ కమిటీ, బోడెపూడి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రతినెలా మొదటి శనివారం ఈ శిబిరం నిర్వహిస్తుండగా, ప్రముఖ వైద్యులు రోగులను పరిశీలించి, ఉచిత పరీక్షలు, మందులను పంపిణీ చేస్తున్నారు. శనివారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో న్యూరో ఫిజీషియన్ జడల రణధీర్ సుమారు 200 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు రాజేష్, సీ.భారవి, రావిళ్ల రంజిత్, కొల్లి అనుదీప్, పీ.సుబ్బారావు, జెట్ల రంగారావు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్,టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఎం.సుబ్బారావు, ఝూన్సీ, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, బీవీకే ట్రస్టు మేనేజర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే తెలపాలి: ఏఈ



పొలంబాటలో రైతులతో విద్యుత్ అధికారులు

నేలకొండపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తేవాలని విద్యుత్ ఏఈ(ఆపరేషన్స్)కుక్కల రామారావు రైతులకు సూచించారు. పొలంబాట కార్యక్రమాన్ని శనివారం కొత్తకొత్తూరు గ్రామంలో నిర్వహించారు. పొలాల్లో ఎక్కడైనా మిడిల్ పోల్స్ అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న లూజులైన్లను సరిచేస్తామన్నారు. ఎక్కువ తక్కువ ఓల్టేజీల కారణంగా మోటార్లు కాలిపోవటం జరుగుతుందని, అలా జరుగకుండా కెపాసిటర్లు పెట్టుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు ఎటువంటి సమస్యలున్నా సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, శెట్టిపల్లి రామారావు, రావెళ్ల జ్యోతిబసు, జ్వాలా కృష్ణ, సబ్‌ఇంజనీర్ అబ్దుల్ ఖదీర్, లైన్ ఇన్స్‌పెక్టర్ సత్యానారాయణరెడ్డి, సిబ్బంది రామకృష్ణ, సతీష్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

నేడు సకల జనుల కార్తీక సమారాధన

సత్తుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హిందూ భక్త ధార్మిక మండలి, ప్రసన్నగణపతి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సకల జనుల కార్తీక సమారాధనతో పాటు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రసన్నగణపతి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అనఘానంద స్వామీజీ ప్రవచన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. తదనంతరం సకల జన వన సమారాధన భోజనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఈ ఆరు గ్యారెంటీల అమలు కోసం సీపీఎం పోరాటాలు చేస్తుందని దీనికి ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. హామీలను అమలు చేయ లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మేరుగు సత్యనారాయణ, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, బాజోజు రమణ, కిలారు శ్రీనివాసరావు, గాలి అరుణ, మాగంటి తిరుమలరావు, పుష్పరాజ్యం, షేక్.మజీద్, నాగరాజు పాల్గొన్నారు.

ఒకవైపు బదిలీలు.. మరోవైపు సిబ్బంది కొరత

» వైరా డివిజన్ ట్రాన్స్‌కోలో కొంతమంది సిబ్బందిదే హవా

వైరా, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో వైరా డివిజన్ కార్యాలయ పరిధిలో ఇటీవల జరిగిన సిబ్బంది బదిలీలు, మరోవైపు సిబ్బంది కొరత అధికారులకు పెనుసవాల్‌గా మారింది. ఈ బదిలీల్లో కొంతమంది పట్టుబట్టి తాము కోరుకున్న స్థానాలకు రావడమే కాకుండా, అధికారులతో తమకున్న పూర్వపు సన్నిహిత పరిచయాలతో ఇక తమదే హవా అంటూ అప్పుడే చెలరేగిపోతున్నారనే చర్చ జరుగుతుంది.

2016 ప్రాంతంలో వైరాలో ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఏర్పాటైంది. ఒక ప్రైవేట్ భవనంలో దీనిని ప్రారంభించారు. మొదటి డీఈగా ప్రస్తుత డీఈ శ్రీనివాసరావు పనిచేశారు. తర్వాత ఆయన నిర్మల్ డీఈగా బదిలీపై వెళ్లారు. ఆయన రావడానికి కొంతకాలం క్రితం వరకు డీఈగా కృష్ణ పనిచేశారు. ఆగస్టు 15న తర్వాత డీఈ కృష్ణ సెలవుపై విదేశాలకు వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీఈగా హీరాలాల్ పనిచేశారు. ఆయన కాలంలోనే వైరా డివిజన్‌లో బదిలీలు జరిగాయి.

వైరా డివిజన్‌లో నాలుగు మండలాలు..

ట్రాన్స్‌కో వైరా డివిజన్‌లో వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలు ఉన్నాయి. ఒక్క వైరా మినహా, మిగిలి మూడు మండలాలు డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి అయిన మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. వైరా, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో రెండేసి సెక్షన్లు, బోనకల్‌లో ఒక సెక్షన్ మాత్రమే ఉంది. కలకోట కేంద్రంగా మోటమర్రి సెక్షన్ ఏర్పాటైనప్పటికీ సాంకేతిక కారణాలతో ఇంకా అది అమలులోకి రాలేదు. ఏడు సెక్షన్లకు ఏఈలున్నారు. వైరా, బోనకల్ మండలాల పరిధిలో ఒక ఏడీఈ, మధిర, ఎర్రుపాలెం మండలాలకు ఒక ఏడీఈ ఉన్నారు. ఈ ఏడు సెక్షన్లు రెండు ఏడీఈ కార్యాలయాలకు వైరా డీఈ కార్యాలయం కేంద్రంగా ఉంది.

బదిలీలు ఇలా...

వైరా ఏడీఈ రామకృష్ణ ముదిగొండ ఏడీఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కిరణ్‌కుమార్ ఏడీఈగా బాధ్యతలు చేపట్టారు. అలాగే బోనకల్ ఏఈ ఉమామహేశ్వరరావు బదిలీ అయ్యారు. మధిర రూరల్ ఏఈ నాగేశ్వరరావు ఖానాపురం హవేలికి బదిలీ అయ్యారు. వైరా టౌన్ ఏఈ ఎస్ఎస్ఎస్.కుమార్ కన్‌స్ట్రక్షన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వి.సుందర్‌కుమార్ వైరా ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ డివిజన్‌లోని మరికొంతమంది ఏఈలు కూడా బదిలీ అయ్యారు. ఇకపోతే నాలుగు మండలాల్లోని లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, అసిస్టెంట్ లైన్‌మన్ల బదిలీ జరిగింది. వీరందరికీఈ నాలుగు మండలాల పరిధిలోనే బదిలీల సర్దుబాటు చేశారు.

పెరిగిన సేవలు..

గత కొన్ని సంవత్సరాల్లో ఏఈ సెక్షన్ కార్యాలయాలు పెరిగాయి. క్షేత్రస్థాయిలో సర్వీస్‌లు, విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా విపరీతంగా పెరిగాయి. అయితే పెరిగిన సర్వీస్‌ల ప్రకారం సిబ్బంది పెరగలేదు. ముఖ్యంగా అసిస్టెంట్ లైన్‌మన్, జూనియర్ లైన్‌మెన్ల కొరత తీవ్రంగా ఉంది. అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలను సకాలంలో అందించలేకపోతున్నారు. ప్రైవేట్ సిబ్బందిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే ప్రాంతానికి చెందిన డిప్యూటీ సీఎం విద్యుత్‌శాఖ మంత్రి అయిన మల్లు భట్టి విక్రమార్క సిబ్బంది కొరతను తీర్చేందుకు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వైరాలోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం

ఈ నాలుగు మండలాల పరిధిలో జరిగిన బదిలీల్లో తమకు అనుకూలమైన స్థానాలను దక్కించుకున్న కొంతమంది సిబ్బంది తమ పాత అలవాట్లను మళ్లీ మొదలు పెట్టారనే విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలో పనిచేసిన చోటు నుంచి మూడేళ్లపాటు ఇతర చోట్లకు బదిలీ అయి తిరిగి మళ్లీ పూర్వపు స్థానాలకు వచ్చిన సిబ్బంది కొంతమంది అప్పుడే తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు యూనియన్ల ద్వారా అధికారులపై వత్తిళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● ఆర్డీవో నర్సింహారావు



ముదిగొండలో మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహారావు

ముదిగొండ, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు అన్నారు. శనివారం ముదిగొండ రైతువేదికలో ఎన్యూమరేటర్లకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎలిజిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో వాల్మీకి కిషోర్, ఎంఈవో రమణయ్య, ఆర్ఐలు ప్రసన్నకుమార్, వహీదా పాల్గొన్నారు.

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని ఎన్యూమరేటర్లకు శనివారం వైరాలోని రైతువేదికలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈనెల ఆరు నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతీ, మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఎంపీవో జ్యోత్స్న, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఏఎస్‌వో మీరాబీ, గరికపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దొంతెబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణనను పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి విజయబాస్కరరెడ్డి సూచించారు. స్థానిక రైతు వేదిక కార్యాలయంలో శనివారం సమగ్ర కుల గణనపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య పాల్గొన్నారు.

కారేపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండ పూర్తి స్థాయిలో నిర్వహించాలని డీఎల్పీవో రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సంత్‌కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు, ఎంపీడీవో సురేందర్, ఎంఈవో జయరాజ్ పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

తల్లాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు లబ్ధి చేకూర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం మండలంలోని రంగంబంజరలో గంగదేవిపాడు సొసైటీ ఆధ్వర్యంలో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎం సీ చైర్మన్లు దోమా ఆనంద్, బాగం నీరజ, ఏవో ఎండీ.తాజుద్దీన్, ఎస్ఐ బి.కొండల్‌రావు, సీఈవో సరికొండ రాకేష్, మాజీ సర్పంచ్‌లు కొమ్మినేని ప్రభాకర్‌రావు, తూము శ్రీనివాసరావు, పోట్రు శరత్, అనుమోలు బుద్దీసాగర్, గణేశుల రవి, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముదిగొండ, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లభీ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, పసుపులేటి దేవేంద్రం, భిక్షం, పుల్లారెడ్డి, రాఘవ, భాస్కర్ పాల్గొన్నారు.

బోనకల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ మధుబాబు, సొసైటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, రాయనపేట, లక్ష్మీపురం గ్రామాలలో శనివారం సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుపల్లి ప్రేమ్ కుమార్, చింతకాయల వెంకటేశ్వర్లు, తూము రోషన్ కుమార్, యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



రంగంబంజరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాచౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో రూప, సత్యం, కాకర్ల రంగారావు, పాలడుగు రవీంద్ర, బత్తుల రాము, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు తల్లాడ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తల్లాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు స్థానిక బాలభారతి విద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-17బాలుర విభాగం నుంచి దూళ్ల ధనుష్, పొట్టేటి వెంకటకృష్ణారెడ్డి ఇటీవల కొత్తగూడెంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఏవో వై.శశాంక్ అభినందించారు.

పంటల నమోదు పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

పెనుబల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిమల్లెలో జరుగుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఏపీఎస్.ప్రసాదరాజు, ఏఈవో సమంత పాల్గొన్నారు.

డైట్ చార్జీల పెంపు పట్ల హర్షం

బోనకల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచినందుకు గానూ గురుకుల ప్రిన్సిపాల్ ఎల్. జ్యోతిర్మయి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్‌శాఖ...పొలంబాట

కారేపల్లి నవంబరు2(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారులు శనివారం కారేపల్లి క్రాస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామలింగాల పల్లిపరిధిలో పోలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా విద్యుత్‌శాఖ అధికారి డీఈ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశానుమేరకు 17వరకు రైతులతో పోలంబాట కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమంలో కొత్తలింగా ఏడీఏ ఆనందకుమార్, ఏఈ సుధకర్‌రెడ్డి సబ్‌స్టేషన్‌సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.

కల్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు, పెద్దకొరుకొండి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని చెన్నూరు, పుల్లయ్య బంజరు, తూర్పులోకవరం, పడమట లోకవరం గ్రామాల్లో విద్యుత్ అధికారులు, సిబ్బందిలు పొలంబాట చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈలు శీలం రామిరెడ్డి, పి. వెంకట్ మాట్లాడుతూ వ్యవసాయ సాగులో రైతులు ఐఎస్ఐ మార్క్ కలిగిన మోటార్లను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌ఇంజనీర్ మదన్, లైన్‌మన్ రాము, హరిష్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రైతులు మాదాల వెంకటేశ్వరరావు, పురం వెంకట్యేరరావు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి'

కొణిజర్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హ్యూమన్ రైట్స్ సొసైటీ, బహుజన అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకుడు ఆదూరి ఆనందం తెలిపారు. మండల కేంద్రం కొణిజర్ల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మానవహక్కుల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదూరి మణి, రాష్ట్ర కన్వీనర్ కువ్వారపు విజయరావు, కొమ్ము భద్రయ్య, నాగేశ్వరరావు, ప్రేమకుమారి పాల్గొన్నారు.

చీరెల పంపిణీ

కారేపల్లి నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మందులవాడకు చెందిన పలువురు పేద మహిళలకు జిల్లా మైనార్టీ సంఘం నాయకుడు షేక్ గౌసద్దీన్ శనివారం చీరెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌస్ మాట్లాడుతూ పేదలకు దానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటివల మండల కేంద్రంలోని సింగరేణి పంచాయతీలో పేదప్రజల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిన్నట్లు తెలిపారు. రానున్న రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఖలీలూల్లఖాన్, సద్దాం హుస్సేన్, షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

సత్తుపల్లిరూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): హనుమను పూజించువారు సమస్త దేవతలను పూజించిన ఫలమును పొందెదరని, హనుమాన్ అనుగ్రహంతో అన్నీ శుభములే కలుగుతాయని మాజీ సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డి అన్నారు. రామ భక్త హనుమాన్‌ను కీర్తిస్తూ పట్టణంలోని సిద్దారం రోడ్డులోని ఎమ్మార్ గార్డెన్‌లో శనివారం చేపట్టిన హనుమాన్ చాలీసా పారాయణంతో అంజనేయ నామస్మరణతో మారుమ్రోగింది. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యోగా ఎంపికలు

కొణిజర్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ల ఉన్నత పాఠశాలలో శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాల స్థాయిలో అండర్-14, అండర్-17 పాఠశాలల యోగా ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలను ఎంఈవో అబ్రహం ప్రారంభించారు. ఈ ఎంపికలలో ఆయా పాఠశాలల నుంచి 50 మంది బాలురు, 42 మంది బాలికలు పాల్గొన్నారు. ఆరు గ్రూపులుగా ఏర్పాటు చేసి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఈనెల 5 నుంచి 7 వరకు వరంగల్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారని తనికెళ్ల పాఠశాల పీడీ దొండపాటి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు రఘూన్స్ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, భీమా తదితరులున్నారు.

సత్తుపల్లిరూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు సత్తుపల్లి పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో యోగా టీమ్ కోసం తనికెళ్లలో అండర్-14, 17విభాగాలలో శనివారం నిర్వహించిన సెలక్షన్స్‌లో సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్లు హెచ్ఎం నీరుడు నాగేశ్వరరావు తెలిపారు. వీరంతా ఈనెల 5వ తేదీ వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పీడీ చీకటి శ్రీదేవిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



కొణిజర్ల : ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

చేపపిల్లల పంపిణీలో మోసం

● లబోదిబోమంటున్న సొసైటీ సభ్యులు

వేంసూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైరా మత్స్యశాఖ ఆధ్వర్యంలో వేంసూరు మండలంలోని చెరువులకు సొసైటీల ఆధ్వర్యంలో చేప పిల్లల పంపిణీని శనివారం ప్రారంభించారు. ఒక్కో కవర్‌లో వెయ్యి చేప పిల్లలు అని చెప్పి, మత్స్య సహకార సంఘ సభ్యులకు పంపిణీ చేస్తున్నప్పటికీ ఆకవర్లలో కేవలం 400 చేప పిల్లలు మాత్రమే ఉంటున్నాయని సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నప్పటికీ మత్స్యశాఖ అధికారులు మాత్రం, చేపపిల్లల పంపిణీలో అవినీతికి పాల్పడుతున్నారని సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. వేంసూరు మండలంలో మొత్తం 59చెరువులకుగానూ శనివారం 50చెరువులకు 6లక్షల చేపపిల్లలను సరఫరా చేసినట్లు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. చేప పిల్లల పంపిణీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా మత్స్యశాఖ అధికారులు విచారణ చేపట్టాలని సహకార సంఘ సభ్యులు కోరుతున్నారు.



కవర్లలో చేపపిల్లలను చెరువులకు సరఫరా చేస్తున్న దృశ్యం

ఆలయాల్లో కార్తీకమాస పూజలు

సత్తుపల్లిరూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని శనివారం ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎర్రుపాలెం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో వెంకటేశ్వరస్వామి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీకమాస నిత్యన్నదాన కార్యక్రమాన్ని కేఎస్ఆర్ గ్రానైట్స్ అధినేత తుశ్లూరి కోటేశ్వరావు, నిర్మలకుమారి దంపతులు, ఎస్ఐ వెంకటేష్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఆకలి తీర్చడం గొప్ప అదృష్టమన్నారు. ఈకార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, బొబ్బా ప్రసాద్, వీరమాచినేని నాని, కాకుఆను లీలాకృష్ణ, బొబ్బా కిరణ్, చొప్పవరపు శ్రీనివాసరావు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



సత్తుపల్లి కోదండ రామాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బీసీ కమిషన్‌కు సలహాలు, సూచనలకు ఆహ్వానం

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 5తేదీన బీసీ కమిషన్‌కు తమ సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలియజేయాలని మునిసిపల్ కమిషనర్ చింతా వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ దామాషాకు సంబంధించిన అంశంపై తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల(బీసీ) కమిషన్ చైర్మన్ నిరంజన్ ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బీసీ వర్గాలకు చెందినవారు తమ సలహాలు, సూచనలు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చునని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా ఉంటాం

● లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటుందని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. చావా హారిక, గద్దే నీరజ సహకారంతో బీటెక్ విద్యార్థిని గద్దే ఉషారాణికి శనివారం సాయిబాబా మందిరంలో ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, సీహెచ్.వెంకటేశ్వరరావు, అబ్బూరి రమేష్, గద్దే నీరజ, కొల్లా రాంబాబు, మాదినేని దుర్గాప్రసాద్, సాయిబాబా మందిర చైర్మన్ పొడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు 'పసుమర్తి'కి సన్మానం



పసుమర్తి చందర్‌రావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో శనివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన పసుమర్తి చందర్‌రావును యాజమాన్యం శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జానీ మియా ప్రసంగిస్తూ చందర్‌రావు రాజకీయంగా మరేన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రంజిత్‌రెడ్డి, ఎకాడామిక్ డైరెక్టర్ కేశవరావు, హెచ్ఎం ఇందిరా, త్రియంబకరావు (రాజా) ఉపాధ్యాయులు, తదితరులున్నారు.